సాక్షి
నారాయణపేట

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



నేడు లోక్‌అదాలత్

ఇరువర్గాలను ఒకే వేదికపై చేర్చి సమస్యల ను రాజీ పద్ధతిలో పరిష్కరిస్తారు.

వివరాలు 8లో ▸



వడ్ల బస్తాల్లో కంకర రాళ్లు

వడ్ల బస్తాల్లో కంకరరాళ్లు కలిపి విక్రయి స్తున్న ఘటన బాదేపల్లిలో వెలుగు చూసింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.1 /18.2

వాతావరణం

రాత్రివేళలో చలి తీవ్రత తగ్గుతుంది. క్రమంగా ఎండప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం వేడి పెడుతుంది.

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నారాయణపేట రూరల్: సైబర్ నేరగాళ్ల, నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన విలే కర్లతో మాట్లాడుతూ.. ఇటీవల లోన్‌యాప్స్ ద్వారా అప్పులు ఇస్తామని కాల్స్ వస్తున్నాయని, అటువంటి మాటలకు నమ్మి తర్వాత ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల డబ్బు దోచేస్తే డయల్ 100కు, టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఇటు వంటి కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ పోలీసుల సూచనలు పాటించాలన్నారు. గిఫ్ట్ కార్డు వం పామని, లాటరీ కూపన్ వచ్చిందని పర్సనల్ వివరాలు చెప్పాలని, పాస్‌వర్డ్ తదితర వివరాలు ఇవ్వాలని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలని చెప్తే ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వవద్దని చెప్పారు. తెలియని వ్యక్తుల దగ్గర వ్యాపారం చేయరాదన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నారాయణపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవే శపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోవు ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కృషిచేయాలని ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి పీ.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తుందని, కేసీఆర్ అవినీతిని ఎండ గట్టాలన్నారు. బీఆర్ఎస్ పార్టీకి కాలం చెల్లించదని, మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఎద్దేవ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతం ఇవ్వలేని దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చారని చెప్పారు. మద్యం అమ్మకాలపైనే దృష్టి పెట్టి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలి వేశారన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేసి కమల వికాసానికి దోహద పడాలన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కే.రతంగపాండురెడ్డి, జిల్లా అధ్యక్షులు పీ.శ్రీనివాసులు, ప్రభాకరవర్ధన్, నర్సింహులు, రఘురామయ్యగౌడ్, కృష్ణ, సత్యరఘుపాల్ రెడ్డి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

నేటినుంచి పద్య నాటకోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, మన్యం కొండ దేవస్థానం సహకారంతో శనివారం నుంచి 15వ తేదీ వరకు మన్యంకొండ క్షేత్రంలో పద్య నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీమిత్ర కళా నాట్యమండలి అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి శాస్త్రీయ నృత్య ప్రదర్శన, శ్రీకృష్ణ రాయబారం, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం ఉంటుందని తెలిపారు. 12న శ్రీకృష్ణ రాయబారం, ధర్మజ రాజసూయం, 13న శ్రీరామాంజనేయ యుద్ధం ఘట్టం, శ్రీకృష్ణ రాయబారం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధఘట్టం, మాయల పకీర్ మరణవేదన ఏకపాత్రాభినయం, 14న శ్రీకృష్ణ రాయబారం, శ్రీరామాంజనేయ యుద్ధఘట్టం, 15న హరినామ సంకీర్తనలు ఉంటాయని తెలిపారు.

సిడెపై ఎల్లమ్మతల్లి..

డప్పుల మోతలు.. శివసత్తుల పూనకాలు.. బోనపు కుండలతో తరలివచ్చిన భక్తుల నడుమ పోలేపల్లి ఎల్లమ్మ సిడే ఉత్సవం కనులపండువగా సాగింది. శుక్రవారం కోస్గి మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ దేవస్థానం జనసంద్రంగా మారింది.



వివరాలు 8లో..

రేషన్‌కు తంటాలే!



పెద్దతండా

కొత్తపల్లి మండలంలోని పెద్దతండా, తుపాకితండా రెండు కలిపి నాలుగేళ్ల క్రితం గ్రామ పంచాయతీగా ఏర్పడ్డాయి. పెద్దతాండాలో 86 రేషన్ కార్డులు, తుపాకితండాలో 42 రేషన్ కార్డులు ఉన్నాయి. పెద్దతండా వారి రేషన్ షాపు గుండుమాల్ మండలంలోని వీరారంలో ఉంది. తుపాకితండాకు చెందిన వారి రేషన్ షాపు కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామంలో ఉంది. వీరు ఇక్కడి నుంచి రేషన్ బియ్యం కోసం ప్రతి నెలా కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్దతండా వారు వీరారం వెళ్లాలంటే రోడ్డు మార్గాన దాదాపు 8 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. ఈ కారణంగా వీరు మూడు కిలోమీటర్ల దూరంలోని గుండుమాల్‌లోని రేషన్ షాపులో బియ్యం తీసుకుంటున్నారు.

- తండాలు, కొత్త పంచాయతీల్లో లబ్ధిదారుల అవస్థలు
- ఉచిత బియ్యం తెచ్చుకోవాలన్నా తప్పని రవాణా ఖర్చులు
- మూడు నుంచి ఐదు కిలోమీటర్లు వెళ్లి రావాల్సిందే..
- జిల్లాలో 300 రేషన్ షాపులు, 1,40,444 రేషన్ కార్డులు

జిల్లాలో రేషన్ షాపులు, కార్డుల వివరాలు మండలాల వారిగా..

మండలం	రేషన్‌షాపులు	కార్డులు
నారాయణపేట	42	22,549
కోస్గి	40	14,959
మద్దూరు	39	17,315
మక్తల్	38	18,288
దామరగిద్ద	30	12,960
ఊట్కూర్	26	13,313
ధన్వాడ	23	9,007
మరికల్	20	9,380
నర్వ	18	9,045
క్రిష్ణ	12	6,986
మాగనూర్	12	6,642

మద్దూరు: జిల్లాలో పదేళ్ల క్రితం జరిగిన రేషన్ దుకాణాల రేషనలైజేషన్‌తో ఏర్పాటైన చౌక ధరల దుకాణాలతోనే రేషన్ బియ్యం పంపిణీ కొనసాగుతోంది. పెరుగుతున్న జనాభా, రేషన్ కార్డులతో పాటు కొత్త షాపులను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకూ ఆ దిశగా ప్రయత్నాలు జరగడం లేదు. ఫలితంగా ఆయాగ్రామాల ప్రజలు రేషన్ బియ్యం కోసం ప్రతినెలా కిలోమీటర్ల మేర నడవాల్సిన పరిస్థితి నెలకొంది. నాలుగేళ్ల క్రితం ఏర్పాటైన నూతన గ్రామ పంచాయతీల్లోనూ రేషన్ షాపులు ఏర్పాట చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉచితంగా వచ్చిన రేషన్ బియ్యం తెచ్చుకునేందుకు వీరంతా రూ.50 నుంచి రూ.100 వరకు దుకాణాల వద్దకు వెళ్లి రావడానికి ఖర్చు చేయాల్సి వస్తోంది. అంతదూరం వెళ్లలేనికొందరు వృద్ధులు బియ్యం తెచ్చుకోలేకపోతున్నారు.

ఒక్కోసారి బియ్యం తీసుకోవడం లేదు..



ప్రభుత్వం ఉచితంగా అందించే బియ్యం తీసుకోవడానికి గుండుమాల్, లేదా వీరారం వెళ్లాలి. అంతదూరం వెళ్లడానికి వీలుకాక ఒక్కోసారి బియ్యం తీసుకోలేకపోతున్నాం. అంతదూరం వెళ్లడానికి వయస్సు సహకరించడం లేదు. ఇక్కడే షాపు ఉంటే బాగుంటుంది.
– సీతాబాయి, పెద్దతాండా, కొత్తపల్లి మండలం

5 కి.మీ. దూరం



గతంలో మా తండా వీరారంలో ఉండేది. కాలిబాటన వెళ్లాలంటే దాదాపు 5 కిలోమీటర్ల దూరం, అదే రోడ్డు మార్గాన వెళ్లాలంటే 8 కిలోమీటర్ల దూరం అవుతుంది. ఆన్‌లైన్ కావడంతో గుండుమాల్‌లోనే రేషన్ తీసుకుంటున్నాం. అది కూడా మా తండాకు 3 కిలోమీటర్ల పైగానే అవుతుంది. మా తండాలోనే రేషన్‌షాపు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.
– పెంట్యానాయక్, పెద్దతండా

చిన్న షాపులు ఏర్పాటు చేస్తున్నాం..



ధన్వాడ మండలంలో రెండు కొత్త షాపు ఏర్పాటుచేశాం. నిబంధనల మేరకు రేషన్ కార్డుల సంఖ్యను బట్టి రేషన్ షాపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే రేషన్ షాపుకు ఎక్కువ దూరంగా ఉన్న గ్రామాల్లో, తండాలో చిన్నా రేషన్ షాపులను ఏర్పాటు చేస్తున్నాం. 100కు పైగా రేషన్ కార్డులున్న తండాలు గానీ, గ్రామాలు పంచాయతీ తీర్మానం ఇస్తే వాటి సంబంధించి రేషన్ షాపు స్టాక్‌ను అక్కడే దించి వారికి అందజేస్తాము. ఇలా జిల్లాలో ఎక్కడైనా ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాము.
– శివప్రసాద్‌రెడ్డి, డీఎస్‌ఓ, నారాయణపేట

నిబంధనలు ఇలా..

కొత్త రేషన్‌షాపు ఏర్పాటు చేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లోనైతే 500 రేషన్ కార్డులు, మూడు కిలోమీటర్ల దూరం, పట్టణ ప్రాంతాల్లోనైతే 600 నుంచి 800 రేషన్ కార్డులకు ఒక షాపు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో 280 గ్రామ పంచాయతీలు, మూడు మున్సిపాలిటీలు ఉండగా ప్రస్తుతం 300 రేషన్ షాపులు కొనసాగుతున్నాయి. పదేళ్లగా రేషన్ కార్డులు సంఖ్య పెరగడం, గ్రామాలు విస్తరించినా నూతనంగా ఇంత వరకూ కొత్త రేషన్ షాపులు ఏర్పాటు చేయలేదు. ఆర్నెళ్ల క్రితం ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను కూడా జారీ చేసింది. దీంతో షాపుల వద్ద లబ్ధిదారుల సంఖ్య ఎక్కువ ఉండడంతో గంటల తరబడి క్యూలో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

‘ఆరోగ్యవాహిని’తో వైద్యం చేరువ



జిల్లా ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట: నారాయణపేటతో పాటు మద్దూర్ మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రాలేని వారికి ఇంటి దగ్గరే వైద్యం అందించేందుకు ఏర్పాటు చేసిన ఆరోగ్యవాహిని బస్సుతో మెరుగైన వైద్య సేవలు అందించడం **జరుగుతుందని వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నారాయణపేట, మద్దూర్ మండలాల పంచాయతీ కార్యదర్శులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఆరోగ్యవాహిని సేవలు పైలెట్ ప్రాజెక్టుగా నారాయణపేట మండలంలో ప్రారంభించి నేడు మద్దూర్ మండలానికి సేవలు విస్తరించడాన్ని సంతోషిస్తు ఎపిక్ స్వచ్ఛంద సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. మొబైల్ వాహనంలో కనీస వైద్య సదుపాయాలతో పాటు ఒక నర్సు, ఒక డాక్టర్ ఉంటారన్నారు. వారంలో ఐదు రోజులు, ప్రతి రోజు రెండు గ్రామాల్లో ఈ బస్సు తిరుగుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రాలేని వారికి ఉచితంగా బీపీ, షుగర్, జ్వరం వంటి రోగాలకు వైద్యసేవలు అందిస్తారన్నారు.** అవసరమైతే డాక్టర్ టెలీ మెడిసిన్ ద్వారా ఇతర వైద్యులతో సంప్రదించి మెరుగైన వైద్యాన్ని అందిస్తారన్నారు. పంచాయతీ కార్యదర్శులు అన్ని గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించి సేవలను సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో డీపీఓ మురళీ, ఆరోగ్య వాహిని సభ్యులు సాయి ప్రతాప్ పాల్గొన్నారు.

జిల్లాస్పత్రి పనులు వేగవంతం చేయాలి

నారాయణపేట మండలం అప్పంపల్లి వద్ద నిర్మిస్తున్న నూతన జిల్లా ఆస్పత్రి భవన పనులు వేగవంతం చేయాలని, అక్టోబర్‌లోగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం జిల్లా వైద్యశాఖ అధికారులతో కలసి నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పనుల్లో వేగవంతం కోసం ప్రస్తుతం ఉన్న లేబర్‌కు నాలుగింతలు లేబర్‌ను పెంచాల్సిందిగా కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులు వేగవంతమైనప్పుడే గడువులోగా పనులు పూర్తి అవుతాయన్నారు. నాణ్యతలో ఎక్కడ తేడా రావొద్దని, ఎవరు ఎంత మంది ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారనే అంశాల పై సూక్ష్మ ప్రణాళికలు ఉండాలన్నారు. కలెక్టర్‌తో పాటు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్ ఉన్నారు.


‘పది’లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్

నారాయణపేట: జిల్లాలోని పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి పదికి పది జీపీఏతో ఉత్తమ ఫలితాలను సాధించాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్ సూచించారు. మండలంలోని సింగారం స్టేజీ దగ్గర ఉన్న స్కిల్‌డెవలప్ మెంట్ సెంటర్‌లో శుక్రవారం జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖకు సంబంధించిన 10వ తరగతి వసతి గృహ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రేరణ, అవగాహన తరగతులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ప్రేరణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, అన్ని సబ్జెక్టులను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిణి కన్యాకుమారి మాట్లాడుతూ విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు, ఎగ్జామ్ ప్యాడ్‌ల పంపిణీ చేశామని, వంద రోజుల స్పెషల్ డైట్ అందిస్తున్నామని, మంచిగా చదివి ఉత్తమ ప్రతిభతో కార్పొరేట్, గురుకుల కళాశాలలకు ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ లియాఖత్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి

మాగనూర్: జీఓ 317 వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే జీఓ 317 సవరించి ఉపాధ్యాయులు స్థానిక జిల్లాలకు వెళ్లేందుకు దశల వారీగా అవకాశం కల్పించి న్యాయం చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఎమ్మెల్సీలు ప్రభుత్వానికి వత్తాసు పలకడం శోచనీయమన్నారు. ప్రాథమిక సభ్యుల బాధలను పట్టించుకోకుండా కొందరు పైరవీలతో జిల్లాలు బదిలీలు చేసుకోవడం దారుణమని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక ఉపాధ్యాయ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి అనుకుంటే ఇంకా రెట్టింపు అయ్యాయని ఆరోపించారు. సమస్యలు వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాగనూర్ తపస్ అధ్యక్షులు రాంమోహన్, గౌరవ అధ్యక్షులు నర్సింహులు, ఉపాధ్యాయులు సంతోష్, ప్రసన్న, విజయశ్రీ, విజయలక్ష్మి, కవిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

అప్రకటిత కరెంట్ కోతలు అరికట్టాలి

- నాణ్యమైన విద్యుత్ అందించాలి
- రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో

నారాయణపేట/దామరగిద్ద: అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయని, 24 గంటల పాటు త్రిఫేజ్ విద్యుత్‌ను అందించాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట, దామరగిద్దలో శుక్రవారం రైతులు ఆందోళన చేపట్టారు. దామరగిద్దలోని అంబేడ్కర్ చౌరస్తాలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిలయ్యగౌడ్, గోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ ఇస్తామని హామీ ఇవ్వడంతోనే రైతులు బోరు బావుల కింద వరి, వేరుశనగ కూరగాయల పంటలు పండ్లతోటలు సాగు చేశారన్నారు. అప్రకటిత కరెంట్ కోతలతో ఎప్పుడు ఇస్తారో, ఎప్పుడు తీస్తారో అర్థం కావడం లేదన్నారు. సాగు చేసిన పంటలు సాగునీరందక విద్యుత్ కోసం ఎదరుచేడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని కోరారు. గంట పాటు రాస్తారోకో చేపట్టడంతో విద్యుత్ ఏఈ అనిల్ అక్కడికి చేరుకొని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. కార్యక్రమంలో మహేష్‌కుమార్‌గౌడ్, జోషి, శివకుమార్, బాల్‌రాజ్, మహేష్, సాయిలు, బాస్కర్‌రెడ్డి, భీంషేన్ పెంటప్పలు పాల్గొన్నారు.



దామరగిద్దలో రాస్తారోకో చేస్తున్న రైతు సంఘం నాయకులు

నారాయణపేటలో ధర్నా..

వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేయడంలో అంతరాయం కలుగుతున్నదని బీకేఎస్ ఆధ్వర్యంలో నారాయణపేటలోని సత్య నారాయణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు వెంకోబ, అనంతొల్లి మాట్లాడుతూ విద్యుత్ వేళల్లో మార్పులు రావడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు అంటే ముట్టని అధికార పార్టీ నాయకులు, ప్రతి పక్షాలకు రైతు బాధలు పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వినియోగదారులు ఉచితంగా 24 గంటలు కరంట్ అని 6 గంటలు సైతం సరఫరా లేకపోవడంతో విద్యుత్ కోతలతో పంటలు నష్టపోతున్నమన్నారు. అనంతరం డీఈ, ఎస్ఈలకు వినతి పత్రాలను అందజేశారు. ఇందుకు వారు స్పందిస్తూ సోమవారం నుంచి పగలు పూట విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేయకపోతే నారాయణపేట బంద్‌కు పిలుపునిస్తామని బీకేఎస్ నాయకులు, రైతులు హెచ్చరించారు.



నారాయణపేట డీఈ కార్యాలయంలో అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న బీకేఎస్ నాయకులు

ప్రజాసేవకు పునరంకితం



మాట్లాడుతున్న కుంభం శివకుమార్‌రెడ్డి

నారాయణపేట: వెనకబడిన ఈ ప్రాంత అభివృద్ధి కోసం ప్రజలకు సేవ చేయడానికి మళ్లీ పునరంకితం అవుతానని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సుదీర్ఘకాలం తర్వాత శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీవీఆర్‌భవన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కేఎస్ఆర్ అభిమానులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ఆధైర్యపడొద్దని అందరికి అండగా ఉంటానన్నారు. గత కొంత కాలంగా తనపై ఓ పెద్ద మనిషి ఉన్నత పదవిలో ఉండి నియోజకవర్గంలో చేయాల్సిన అభివృద్ధి చేయకుండా కనీస జ్ఞానం లేకుండా తనపై ఇష్టానుసారంగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్నాడని, వాటిని పట్టించుకోవద్దన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేకనే ఓటమి భయంతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని కార్యకర్తలకు సూచించారు. ఇక నుండి కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని హత్ సే హాత్ జోడో కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో పర్యటించి ప్రజల కష్టాలను తెలుసుకొని వారికి అండగా ఉంటానన్నారు. జిల్లాలో ఎక్కడ వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ సరఫరా ఇవ్వడం లేదని అందుకు నిరసనగా ఈ నెల 13న జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యుత్ కార్యాలయం ముట్టడికి అన్ని మండలాల నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ జడ్పీకో ఆప్షన్ సభ్యులు ఎండి గౌస్, నాయకులు జి.సుధాకర్, సదాశివారెడ్డి, మహేందర్‌గౌడ్, సుధాకర్ రెడ్డి, కోట్ల రవీందర్‌రెడ్డి, ఎండి సలీం పాల్గొన్నారు.

కందులు క్వింటా రూ.7,800

నారాయణపేట: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం తెల్లకందులు క్వింటా గరిష్టం, కనిష్టంగా రూ.7,800 పలికింది. ఎర్ర కందులు క్వింటాకు గరిష్టంగా రూ.7,455, కనిష్టంగా రూ.6,840 పలికాయి. వ్యాపారస్తులు పోటాపోటీగా వేరుశనగకు ధరలు కోడ్ చేయడంతో క్వింటాకు గరిష్టంగా రూ.8,012, కనిష్టంగా రూ.4,400 పలికాయి. శనగ క్వింటాకు గరిష్టంగా 4,661, కనిష్టంగా రూ. 4,640 పలికింది. జిల్లాలోని కాటన్ మిల్లులో పత్తికి క్వింటాకు గరిష్టంగా రూ. 7,700, కనిష్టంగా రూ. 4,500 పలికింది.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

గట్టు: మండలంలోని చమన్‌ఖాన్‌దొడ్డి చెందిన రైతు మల్లేష్ (36) శుక్రవారం ఉదయం పొలం వద్ద బోరు మోటార్‌ను ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుతాఘాతానికి గురయ్యాడు. చుట్టు పక్కల వారు విషయాన్ని గమనించి, హుటాహుటిన ఇందువాసి గ్రామంలోని ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ సంఘటనతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. మృతునికి భార్య సరోజమ్మ, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పరామర్శించారు.

బైకును ఢీకొన్న కారు: వ్యక్తి మృతి

రాజాపూర్: బైకుపై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటన జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఖానాపూర్ పంచాయతీ పరిధిలోని సోమ్లానాయక్‌తండాకు చెందిన సంతోష్(27) గురువారం రాత్రి రంగారెడ్డిగూడలో తన చికెన్‌సెంటర్‌ను మూసి రాత్రి తన గ్రామానికి తన బైక్‌పై బయలుదేరాడు. రాజాపూర్ శివారులో జాతీయ రహదారిపై యూటర్న్ చేస్తుండగా వెనుక నుంచి కారు వచ్చి ఢీకొంది. సంతోష్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే మహబూబ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టాలు దాటుతుండగా ఢీకొన్న రైలు

- యువకుడు మృతి

జడ్చర్ల టౌన్: సిగ్నల్‌గడ్డ సమీపంలో రైలుపట్టాలు దాటుతున్న క్రమంలో రైలు ఢీకొనడంతో మహమ్మద్ అతీఫ్‌ముహీబ్ (20) మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ తెలియజేశారు. మొదట గుర్తుతెలియని వ్యక్తిగా భావించి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహం భద్రపర్చామని తెలిపారు. కుటుంబ సభ్యులు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇంటినుంచి బయటకు వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు ఆయన తెలిపారు.

6 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేట దుందుబీ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. తెలకపల్లి, నాగర్‌కర్నూల్, బల్మూరు తదితర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లు రఘుపతిపేట నుంచి ఇసుకను తరలిస్తున్నాయి. శుక్రవారం చేసిన దాడుల్లో 3 ఇసుకతో కూడిన ట్రాక్టర్లు, మరో మూడు ఖాళీ ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

తెలకపల్లి: సారా తయారీ కోసం విక్రయించడానికి దాచి ఉంచిన నల్లబెల్లం, పటికను ఎక్సైజ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ పరమేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల మండలం సూరాపూర్ చెందిన మూడావత్ రాజు తన వ్యవసాయ పొలంలో బావి వద్ద 86 బ్యాగుల నల్లబెల్లం, పౌడర్, 4 బ్యాగుల్లో పటిక దాచి ఉంచారు. పక్కా సమాచారంతో శుక్రవారం గ్రామంలోఎక్సైజ్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎట్టకేలకు నిలిచిన 'తుంగభద్ర ఎక్స్‌ప్రెస్'



దేవరకద్ర: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో శుక్రవారం తుంగభద్ర, ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీ మన్నెశ్రీనివాస్‌రెడ్డి కృషి ఫలితంగానే దేవరకద్ర జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఉదయం 7:20 గంటలకు కర్నూల్ వైపు నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఇక్కడ నిలిపారు. అలాగే సాయంత్రం 4:30 గంటలకు కర్నూల్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలు నిలిపారు. దీంతో తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ రైలుకు బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికి పూజలు చేశారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేవరకద్ర నుంచి కాచిగూడ వరకు కేవలం రూ.60 మాత్రమే టికెట్ ధర ఉందని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జట్టి నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్, కొండ శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, చల్మారెడ్డి, ఈవో సీత్యానాయక్ పాల్గొన్నారు.

సిడెపై ఊరేగిన జగజ్జనని

- పోలేపల్లికి పోటెత్తిన భక్తులు
- 50 అడుగుల ఎత్తులో రథాన్ని లాగుతూ దేవాలయం చుట్టూ ప్రదక్షిణ
- అమ్మవారికి బండారు చల్లి తరించిన జనం



కోస్గి: మండలంలోని పోలేపల్లి ఎల్లమ్మ దేవస్థానం జనసంద్రంగా మారింది. శుక్రవారం సాయంత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిడె (రథోత్సవం) నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనపు పటువలతో, కోడి పుంజులతో, వేపాకులు ధరించి శివసత్తుల పూనకాలతో, డప్పుల మోతల నడుమ పూజలు చేసి, ప్రసన్నాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక భక్తుల రాకతో ప్రాంగాణమంతా జనంతో కిటకిటలాడింది. ఎల్లమ్మ మాతాకి జై.. మావురాల ఎల్లమ్మ మాపై కరుణ చూపమ్మ అంటూ.. భక్తులు సిడె ఘట్టంలో పసుపు బండారు చల్లుతుండగా జగజ్జనని సిడెపై ఊరేగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకొని సాయంత్రం కన్నుల పండగగా సిడెను భక్త కోటి తిలకించి తరించారు. అమ్మవారికి బండారు చల్లుతూ ఎల్లమ్మ నామస్మరణతో తరించిపోయారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో ఉంచి సుమారు 50అడుగుల ఎత్తులో నుంచి రథాన్ని లా గుతూ దేవాలయం చుట్టు ప్రదక్షిణ చేయించారు.



సిడెను మొక్కుతున్న భక్తులు

ఎల్లమ్మను దర్శించుకున్న ప్రజాప్రతినిధులు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, ఈఓ రాజేందర్, ఎంపీపీ మధుకర్‌రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష, నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



ఆలయంలో హారతి ఇస్తున్న పూజారి



పూజల్లో ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తదితరులు

ఉత్సవాలకు భారీ బందోబస్తు

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నారాయణపేట డీఎస్పీ సత్యనారాయణ, సీఐ జనార్దన్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుల్స్, మహిళ పీసీలు, హోంగార్డులు, ఇతర ప్రత్యేక సిబ్బంది విధులు నిర్వహించారు. దొంగతనాలు, అవాంఛనీయ సంఘటనలు కాకుండా నిఘా ఏర్పాటు చేశారు.



బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు



దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెళ్లిలో ఫొటో గొడవ

- కొట్టుకున్న వరుడి స్నేహితులు, వధువు బంధువులు

నవాబుపేట: పెళ్లి కోసం వచ్చిన బంధువులు, స్నేహితుల మధ్య ఫొటో దిగేందుకు వాగ్వివాదం చోటుచేసుకొని గొడవకు దారితీసిన ఘటన మండలంలోని లోకిరేవు గ్రామంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరుడు గొర్రెంక సుధాకర్ స్నేహితులు ఫొటో దిగేందుకు స్టేజీ పైకి వెళ్తుండగా, అమ్మాయి తరపు బంధువులు అదే సమయంలో మేము ఫొటో దిగుతామని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ మొదలై మాటామాట పెరిగి కర్రలు, రాళ్లతో కొట్టుకునే వరకు వెళ్లింది. ఈ ఘటనలో కావేల వెంకటయ్య, నర్సింహులు, కేశవులు, బాలకిష్టయ్య గాయపడ్డారు. గాయపడిన వారు పోలీస్‌స్టేషన్‌లో దాడిచేసిన వారిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

నేటినుంచి పద్య నాటకోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, మన్యంకొండ దేవస్థానం సహకారంతో శనివారం నుంచి 15వ తేదీ వరకు మన్యంకొండ క్షేత్రంలో పద్య నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీమిత్ర కళా నాట్యమండలి అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి శాస్త్రీయ నృత్య ప్రదర్శన, శ్రీకృష్ణ రాయబారం, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం ఉంటుందని తెలిపారు. 12న శ్రీకృష్ణ రాయబారం, ధర్మజ రాజసూయం, 13న శ్రీరామాంజనేయ యుద్ధం ఘట్టం, శ్రీకృష్ణ రాయబారం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధఘట్టం, మాయల పకీర్ మరణవేదన ఏకపాత్రాభినయం, 14న శ్రీకృష్ణ రాయబారం, శ్రీరామాంజనేయ యుద్ధఘట్టం, 15వ తేదీన భజనలు, హరినామ సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

సీనియర్ నేషనల్ పోటీలో అనన్యశ్రీ ఘనత

- కేరళ రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం
- బంగారం పతకం కైవసం

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలోని మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ వాలీబాల్ క్రీడలో అరుదైన ఘనత సాధించింది. అసోం రాష్ట్రం గౌవహటిలో ఈనెల 2వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించిన 71వ ఉమెన్ సీనియర్ నేషనల్ వాలీబాల్ పోటీలకు కేరళ రాష్ట్ర జట్టుకు ఈమె ప్రాతినిథ్యం వహించింది. సీనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో కేరళ మహిళా జట్టు విజేతగా నిలవడంతో అనన్యశ్రీ బంగారు పతకం సాధించింది.

పలు సార్లు జాతీయస్థాయిలో ప్రతిభ

అనన్యశ్రీ తెలంగాణ, కేరళ రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించడం విశేషం. రాష్ట్రం నుంచి అనన్యశ్రీ 2018 పంజాబ్ (చండీఘర్)లో జూనియర్ నేషనల్ వాలీబాల్ టోర్నీలో రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహించింది. 2019లో తమిళనాడు రాష్ట్రం ధర్మపురి, 2020 కడపలో జూనియర్ నేషనల్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. కేరళ రాష్ట్ర తరపున గతేడాది ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రాపూర్‌లో 23వ జాతీయస్థాయి, మహారాష్ట్ర సాంగ్లి జిల్లా ఇస్లాంపూర్‌లో 24వ జాతీయస్థాయి యూత్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. కేరళలో సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ, మహారాష్ట్ర కొల్హాపూర్‌లో సీనియర్ లీగ్ (హరియంట్ చసాక్) వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొంది. ఈ మూడు టోర్నీల్లో కేరళ జట్టు విన్నర్‌గా నిలిచింది.



సీనియర్ నేషనల్ విన్నర్ ట్రోఫీతో అనన్యశ్రీ

బాలిక ఆత్మహత్యకు కారణమైన బాలుడికి జైలుశిక్ష

మిడ్జిల్: బాలికను ప్రేమించి పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యకు పాల్పడడంతో అందుకు కారణమైన బాలుడికి శుక్రవారం జువైనల్ కోర్టు జైలు శిక్ష విధించింది. ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ తండాకు చెందిన బాలిక, ఊర్కొండ మండలంలోని తండాకు చెందిన బాలుడు ప్రేమించుకున్నారు. కాగా బాలిక గర్భావతి కావడంతో పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకురాగా, బాలుడు అందుకు నిరాకరించాడు. దీంతో 2019లో బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం జిల్లా జువైనల్‌లో కోర్టులో ప్రవేశపెట్టగా బాలుడికి మూడేళ్ల జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ వివరించారు.

మైనర్‌ను పెళ్లి చేసుకున్న వ్యక్తి రిమాండ్

నవాబుపేట: బాలికను పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మహబూబ్‌నగర్ రూరల్ సీఐ రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్ఐతో కలిసి ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని కారుకొండ చెందిన బ్యాగరి బాలరాజు బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి పెళ్లి చేసుకున్నాడని తెలిపారు. ఈ మేరకు తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మైనర్‌లను ప్రేమ పేరుతో మోసం చేయటం నేరమని వారికి మైనార్టీ తీరితేనే వారి అంగీకారం పరిగణలోకి వస్తుందని వస్తుందని సీఐ తెలిపారు.

బోర్డు ధ్వంసం చేసిన వ్యక్తుల రిమాండ్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ వద్ద ఉన్న 'మన మహబూబ్‌నగర్' బోర్డును ధ్వంసం చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని శుక్రవారం రిమాండ్ తరలించినట్లు రూరల్ సీఐ రాజేశ్వర్‌గౌడ్ వెల్లడించారు. తిమ్మాసానిపల్లికి చెందిన మోహన్, బృందావన్ కాలనీకి చెందిన నర్సింహతో పాటు మరో బాలుడు కలిసి ఈనెల 5న తెల్లవారుజామున మెట్టుగడ్డ వద్ద ఉన్న 'మన మహబూబ్‌నగర్' బోర్డును ధ్వంసం చేశారని తెలిపారు. ఇందులో మోహన్, నర్సింహను జిల్లా జైలుకు తరలించగా, బాలుడిని జువైనల్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

రాజీతో ఇరువర్గాలకు న్యాయం

- నేడు జాతీయ లోక్ అదాలత్
- జిల్లాలో 3,700కేసులు రాజీ కోసం గుర్తింపు

మహబూబ్‌నగర్ క్రైం: న్యాయస్థానాల్లో ఎన్నో కేసులు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో లోక్ అదాలత్‌లో ఇరు వర్గాలను ఒకే వేదికపై హాజరుపర్చి న్యాయమూర్తుల సమక్షంలో సమస్యలను రాజీ పద్ధతిలో వెంటనే పరిష్కరిస్తారు. న్యాయ సేవల గురించి వివరాలు తెలుసుకోవాలనుకునేవారు ఉచిత హెల్ప్‌లైన్ 15100ను సంప్రదించవచ్చు. శనివారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కేంద్రంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు.

3,700 కేసుల గుర్తింపు

జిల్లాలో లోక్ అదాలత్‌లో మొత్తం 3,700 కేసులను పరిష్కరించడానికి కోర్టుతో పాటు పోలీస్ శాఖ గుర్తించింది. రాజీ అయ్యే కేసుల్లో ప్రధానంగా క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, ఇన్సూరెన్స్, బ్యాంకు, ఎలక్ట్రిసిటీ, భూ తగదాలు, ఎక్సైజ్, మోటార్ వెహికల్, చిట్‌ఫండ్, చెక్ బౌన్స్ కేసుల్లో రాజీ అయ్యే అవకాశం ఉంది. మహబూబ్‌నగర్ కోర్టులో 4 బెంచీలు, జడ్చర్ల కోర్టులో ఒక బెంచీ ఏర్పాటు చేశారు. ఇప్పటికే కేసులు అధికంగా పరిష్కారం కోసం రావడానికి సంబంధిత న్యాయవాదులతో పాటు ఇన్సూరెన్స్ కంపెనీలు, ఆర్టీసీ, బ్యాంకు, పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. రాజీ అయ్యే కేసులలో ప్రధానంగా డ్రంకన్‌డ్రైవ్, ఈ–పెట్టి, ఎంవీఐ యాక్టు, డిజాస్టర్ మెనేజ్‌మెంట్ కేసులు పరిష్కారిస్తారు.



ఇలాంటి కేసుల్లో రాజీ లేదు

హత్యలు, హత్యాయత్నాలు, అత్యాచారాలు, మైనర్లపై లైంగిక దాడులు, దొంగతనాలు, దోపీడీలు, ప్రత్యేక చట్టాలపై నమోదైన కేసులను, క్రూరమైన కేసును లోక్ అదాలత్‌లో రాజీకి వీల్లేదు.

ఖైదీలకు లోక్ అదాలత్

చిన్న నేరాలు చేసి బెయిల్ మంజూరైనప్పటికి జామీను సమర్పించకపోతే కొంత మంది నిందితులు చాలా కాలంగా జైల్లో ఉంటారు. ఇలాంటి నిందితుల గురించి ప్రభుత్వంపైనా ఖర్చు పెరుగుతుంది. న్యాయమూర్తులు స్వయంగా జైలుకు వెళ్లి అక్కడి నిందితుల కేసులను పరిశీలిస్తారు. ఖైదీలు సన్మార్గంలో జీవిస్తామని హామీ ఇచ్చి నేరం అంగీకరించడంతో కొద్దిపాటి శిక్షతో లోక్ అదాలత్ తీర్పు ఇస్తాయి. ఇలాంటి వాటిలో చాలాకాలంగా ఉంటున్న చిన్నపాటి నేరస్తులు వెంటనే విడుదలకు నోచుకుంటారు.

లోక్ అదాలత్ ద్వారా లాభాలు

- ఈ సేవలను వినియోగించుకునేందుకు రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదు.
- వీటి ద్వారా కేసులను పరిష్కరించుకుంటే దావావేసే సమయంలో కోర్టుకు చెల్లించే ఫీజులను తిరిగి చెల్లిస్తారు.
- దావా వేసిన తర్వాత సాక్షుల విచారణ, వాయిదాలతో కాలయాపన అవుతుంది. లోక్ అదాలత్‌లో తీర్పులు వెంటనే వెలువడుతాయి.
- లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం అయితే పైకోర్టుకు వెళ్లే అవకాశం ఉండదు.
- కోర్టులోనే దావా దాఖలు చేయాలన్న నిబంధన లేదు. కోర్టులో దాఖలు కాని కేసులను స్వయంగా వచ్చి తెలిపినా ఎలాంటి ఖర్చు లేకుండా ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి పరిష్కారిస్తారు.

న్యాయ సేవాధికార సంస్థ సాయం

ప్రజలకు సమస్య ఏర్పడితే మండల, జిల్లా స్థాయిలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి వారి సమస్యను చెప్పవచ్చు. ఏదైనా తగాదా ఏర్పడితే న్యాయస్థానంలో దావా దాఖలు చేయకంటే ముందు నేరుగా న్యాయసేవా అధికార సంస్థను ఆశ్రయిస్తే ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి లోక్‌అదాలత్ కార్యక్రమం ద్వారా ఇరువర్గాల సమస్యను పరిష్కరించి వెంటనే తీర్పు చెబుతారు. ఇవే కాకుండా న్యాయస్థానాల్లో దాఖలైన కేసులను కూడా లోక్ అదాలత్ పరిష్కరించుకోవచ్చు.

ప్రభుత్వం 'ధరణి'ని రద్దు చేయాలి

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి సైట్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెబ్‌సైట్‌లో మార్పులు చేర్పులు చేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఒకరి భూములు మరొకరి పేరుపై వెళ్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతున్న తుగ్లక్ పాలనలో మంత్రులు ఎమ్మెల్యేలు నిమిత్త మాత్రమే అని విమర్శించారు. శ్రీశైలం ఎడమ కాల్వలో నీటి చౌర్యాన్ని అడ్డుకోకపోతే రాబోయే నెలలో తాగు, సాగునీటికి కటకట ఏర్పడుతుందని, ఎమ్మెల్యేలు, మంత్రులు వెంటనే స్పందించి రైతుల ప్రయోజనాలను కాపాడాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ ఏమి చేయలేదని పేర్కొనడం దారుణమన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సంస్కరణలు అమలు చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. సమస్యలతో దేశం సతమతమవుతున్నా ప్రధాని మాత్రం ఆదాని, అంబానీలకు ప్రజాధనాన్ని కట్టబెట్టేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో శశిధర్‌రెడ్డి, రవి, రోహిణి, గోవర్దన్‌రెడ్డి, సుమిత్ర, నారాయణగౌడ్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి

వడ్ల బస్తాల్లో కంకర రాళ్లు

- 112 బస్తాలు స్వాధీనం చేసుకున్న అధికారులు

జడ్చర్ల టౌన్: వడ్ల బస్తాల్లో కంకరరాళ్లు కలిపి విక్రయిస్తున్న ఘటన బాదేపల్లి పట్టణంలో శుక్రవారం రాత్రి వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ రమేష్‌బాబు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, విజిలెన్స్ అధికారి బాలరాజు శుక్రవారం రాత్రి పట్టణ శివారులోని సత్యసాయి రైస్‌మిల్‌లో తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో మిల్ మూసి ఉన్నప్పటికి ఆవరణలో నిల్వ చేసిన బస్తాలను పరిశీలించారు. 112 బస్తాలు ఉండగా ఒక్కో బస్తా 60కిలోలుగా ఉంది. అందులో వడ్లతో పాటు 6కిలోల కంకర రాళ్లు నింపి ఉండటాన్ని అధికారులు గుర్తించారు. మిల్ ఆవరణలోనే పెద్ద ఎత్తున కంకర నిల్వలు గుర్తించారు. యజమాని అందుబాటులో లేకపోవటంతో ప్రస్తుతానికి బస్తాలు సీజ్ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. శనివారం ఉదయం మిల్ తెరిచి చూస్తామని, కంకర రాళ్లతో కూడిన వడ్లను ఎక్కడికి పంపిస్తున్నది విచారిస్తామని తెలిపారు. గురువారం పట్టణంలో భారీగా కల్తీ టీ పొడి లభించగా, శుక్రవారం వడ్లల్లో కంకరరాళ్లు కలిపి ఉండటం వెలుగు చూడటంతో జడ్చర్ల కల్తీకి కేరాఫ్‌గా మారుతుందని జోరుగా చర్చించుకుంటున్నారు.



వడ్ల బస్తాల్లో కలిపిన కంకరరాళ్లు



పరిశీలిస్తున్న అధికారులు

1,020 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,020 అడుగుల వరకు నీటి మట్టం వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200, సమాంతర కాల్వ ద్వారా 157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 250, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తాం

- బీజేపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాణిరుద్రమదేవి



మాట్లాడుతున్న రాణిరుద్రమదేవి

పాలమూరు: పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం కోసం కార్నర్ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు బీజేపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాణిరుద్రమదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని మర్లులో శుక్రవారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి కార్నర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బూత్ కేంద్రంలో పార్టీని బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అందులో జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. కుటుంబ, అరాచక పాలన నుంచి ప్రజలను కాపాడటంతో పాటు బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీ ఉందనే విషయాన్ని ప్రజలు నమ్ముతున్నట్లు తెలిపారు. తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ వారి అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్నట్లు ఉందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, పద్మజారెడ్డి, నారాయణయాదవ్, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.